క్లుప్తంగా

పోక్సో చట్టం, శక్తి యాప్‌పై అవగాహన



చట్టాలపై అవగాహన కలిగిస్తున్న వన్‌టౌన్ ఎస్సై

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే నేరాలు, బాధితులు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం స్థానిక కస్తూరిబా నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఏలూరు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్సై నాగబాబు బాలికల భద్రత కోణంలో, శారీరక సంబంధాలపై మంచి, చెడు స్పర్శల మధ్య తేడా గురించి వివరించారు. సైబర్ నేరాలు సోషల్ మీడియా వేదికల వాడకంలో జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచారం పంచుకోవడంలో ఉండే ప్రమాదాలు, ఫేక్ అకౌంట్స్, మోసపూరిత లింకుల ద్వారా జరుగుతున్న నేరాలపై అప్రమత్తం చేశారు. ఆపదలో ఉన్న మహిళలు, యువతులు తక్షణ సహాయం పొందేందుకు శక్తి యాప్‌ను ఎలా ఉపయోగించాలో ప్రాక్టికల్‌గా వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పాఠశాలలో వసతుల కొరతపై కలెక్టర్‌తో చర్చ

ఏలూరు(మెట్రో): భీమడోలు మండలం పోలసానిపల్లిలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో విద్యార్థులు మౌలిక వసతుల కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ జి.పద్మశ్రీ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి కోరారు. మంగళవారం కలెక్టర్‌ను కలిసిన ఆమె ఇటీవల పాఠశాలను సందర్శించిన సందర్భంగా అక్కడ గుర్తించిన సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న విలియమ్స్

కామవరపుకోట: రేషన్ బియ్యం సరఫరాలో అవకతవకలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి విలియమ్స్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ద్వారకతిరుమల, కామవరపుకోట మండలాల రేషన్ డీలర్ల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ డీలర్లు అందరూ సమయపాలన పాటించాలని, ఐవీఆర్ఎస్ కాల్స్‌లో పని తీరు బాగోలేదని ఫీడ్ బ్యాక్ వచ్చిన డీలర్లపై అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మెరుగు చేసుకోవాలని సూచించారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు లబ్ధిదారులతో మర్యాద నడుచుకోవాలన్నారు. వికలాంగులు, వృద్ధులకు వారి ఇళ్ల వద్దే బియ్యం పంపిణీ చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో కామవరపుకోట సివిల్ సప్లయిస్ డీటీ శేషగిరి, ద్వారకా తిరుమల డిటి నాగరాజు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

330 హాస్టల్ సీట్లు ఖాళీ

దెందులూరు: కొవ్వలిలో ఉన్న నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 330 సీట్లు ఖాళీ ఉన్నాయని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం హాస్టల్‌లో ఆయన మాట్లాడుతూ మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉచిత వసతి భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. దెందులూరు మండలంతో పాటు సమీప గ్రామాల్లో పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు కొవ్వలిలోని నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సంప్రదించాలని ఆయన కోరారు.

కూటమి పాలనలో వైద్య రంగం కుదేలు

- కుయ్.. కుయ్ సైరన్ మోతలు లేవు
- ఏలూరు జీజీహెచ్‌లో క్రిటికల్ కేర్ లేదు
- పట్టించుకోని పాలకులు, జిల్లా అధికారులు



ఏలూరు సర్వజన ఆసుపత్రి (ఫైల్)



గతంలో 108 అంబులెన్స్ సేవలు ఇలా (ఫైల్)

ఏలూరు టౌన్: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలంలో వైద్య రంగం కుదేలైంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో వైద్య సేవలు అందే పరిస్థితి లేకపోవటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏదైనా ఆరోగ్యం విషమిస్తే, కార్పొరేట్ హాస్పిటల్ లేదా విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు తరలించటమే పరిపాటిగా మారింది. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల ప్రాణాలకు భరోసా లేకుండా పోయింది. మరోవైపు తీవ్ర అనారోగ్యమో లేక రోడ్డు ప్రమాదమో జరిగి ఆపద స్థితిలో అత్యవసర సేవల 108కు ఫోన్ చేస్తే, అంబులెన్స్‌ను అందుబాటులో లేవనే సమాధానం వస్తోంది. ఏలూరు జిల్లా కేంద్రమైన నగరంలోనే వైద్యసేవలు ఇంత దారుణంగా, నిర్లక్ష్యంగా ఉంటే ఇక గ్రామాల్లో పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతుంది.

- ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తిని తీవ్ర అనారోగ్యంతో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తీసుకొచ్చారు. గ్యాస్ నొప్పో లేదా గుండె నొప్పో తెలియని పరిస్థితిలో వస్తే కనీసం ప్రాథమిక వైద్య చికిత్స చేయకుండానే విజయవాడ రిఫర్ చేశారు. ఏలూరులోని కార్పొరేట్ హాస్పిటల్‌కు వెళదామంటే జేబులో భారీగా డబ్బు ఉండాల్సిందే. పేదలు కావటంతో చేసేదేమీ లేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విజయవాడ వెళ్లాల్సిన దుస్థితి వచ్చిందని బాధితులు వాపోయారు.
- ఏలూరు నగరానికి చెందిన ఒక వ్యక్తికి మోటారు సైకిల్ ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై పడిపోయి ఉండడంతో స్థానికంగా ప్రజలు గుమిగూడారు. అర్జెంటుగా హాస్పిటల్‌కు తరలించాలనే ఉద్దేశంతో అత్యవసర సేవల 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. ఏలూరులో 108 అంబులెన్స్‌లు అందుబాటులో లేవని, సమయం పడుతుందని సమాధానం చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ఇంతకంటే ఏమి ఆశించలేమంటూ అక్కడి యువత అసహనం వ్యక్తం చేయటం గమనార్హం.

జీజీహెచ్‌లో వైద్యం నిల్

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో వైద్య సేవలు అధ్వానంగా మారాయి. నిత్యం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి సుమారుగా 900 నుంచి 1200 మంది రోగులు హాస్పిటల్‌కు వస్తుంటారు. ఓపీ సంగతి అటుంచితే, అత్యవసర సేవలు అందే పరిస్థితి పూర్తిగా కనుమరుగైందనే చెప్పాలి. ఏలూరు జీజీహెచ్‌లో నిపుణులైన వైద్యులను నియమించాల్సి ఉండగా ఏడాది గడచినా కూటమి ప్రభుత్వం అలాంటి చర్యలేమీ చేపట్టలేదు. ముఖ్యంగా హార్ట్‌ఎటాక్ వస్తే ప్రాథమిక వైద్యం చేసే పరిస్థితి కూడా లేదని బాధిత రోగుల బంధువులు వాపోతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో ముఖ్యంగా తలకు దెబ్బ తగిలి వస్తే న్యూరో సర్జన్, క్రిటికల్ కేర్ వైద్య నిపుణులు చికిత్స అందించాల్సి ఉంటుంది. కానీ ఏలూరు జీజీహెచ్‌లో అత్యవసర వైద్య సేవలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి.

కనిపించని 108 వాహనాలు

దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ కుయ్.. కుయ్ మంటూ 108 అంబులెన్స్‌లను రోడ్లపై పరుగులు పెట్టించారు. 2019 – 24 మధ్యలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం కొత్త అంబులెన్స్ వాహనాలు కొనుగోలు చేసి కరోనా వంటి ఆపత్కాలంలో భరోసా కల్పించారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో అత్యవసర సేవల 108 అంబులెన్సుల సైరన్ వినిపించటంలేదు. రోడ్డు ప్రమాదం లేదా తీవ్ర అనారోగ్యంతో కాల్ చేస్తే అంబులెన్స్ వాహనాలు అందుబాటులో లేవని చెబుతున్నారని, ఏలూరులోనే లేకుంటే ఇక గ్రామాల్లో పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏలూరు జీజీహెచ్ నుంచి విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు అంబులెన్స్‌లు పంపుతూ నగరంలో మాత్రం లేకుండా చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్య భరోసా లేదు



కూటమి ప్రభుత్వంలో పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందే పరిస్థితి లేదు. గత వైఎస్సార్ సీపీ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. కానీ కూటమి ప్రభుత్వం పేదలకు ఆరోగ్య భరోసా కల్పించలేని దుస్థితిలో ఉంది. ఏలూరు జీజీహెచ్‌లో నిపుణులైన వైద్యులను నియమించలేకపోయింది. గుండె, న్యూరో సర్జన్, క్రిటికల్ కేర్ వంటి కీలక పోస్టులను సైతం భర్తీ చేయకపోయింది. ప్రజల ప్రాణాలంటే ఈ ప్రభుత్వానికి లెక్కలేదు.

– నూకపెయ్యి సుధీర్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్

ఫోన్ చేసినా వాహనం రావటం లేదు



ఏలూరు నగరంలో అత్యవసర పరిస్థితిలో 108 అంబులెన్స్ కోసం ఫోన్ చేస్తే రావటంలేదు. గతంలో మాజీ సీఎం జగనన్న హయాంలో 10 నిమిషాల్లోపే అంబులెన్స్‌లు వచ్చేవి. జిల్లా కేంద్రంలోనే అంబులెన్స్‌లు అందుబాటులో లేవని చెప్పటం విడ్డూరంగా ఉంది. రోడ్డు ప్రమాదం జరిగి ప్రాణాపాయంలో ఉంటే టైమ్ పడుతుందని సమాధానం చెబుతున్నారు. అధికారులు, నాయకులు దీనిపై చర్యలు తీసుకోవాలి.

– బండ్లమూడి సునీల్‌కుమార్, యువజన నాయకులు, వైఎస్సార్ సీపీ

నేడు ఉపాధి కూలీల ధర్నాలు

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ కూలీలు, సిబ్బందికి పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని బుధవారం జిల్లా, మండల కేంద్రాల్లో నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి షేక్ బాషా పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకాన్ని (కరువు పనిని) ఏప్రిల్, మే, జూన్ నెలల్లో అమలు చేశారని తెలిపారు. కొన్నిచోట్ల 50 పని దినాలను కూడా కల్పించలేదని, చేసిన పనికి కూలి చెల్లించటంలేదని, ఇప్పటికీ ఇంకా కొన్నిచోట్ల రెండు నెలలుగా కూలి చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో నియమించిన ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ వారిని నియమించుకునేందుకు జాబితాను సిద్ధం చేసుకున్నారని తెలిపారు. విధివిధానాలు పాటించకపోవడంతో నియామకం పెండింగ్‌లో పడిందని వివరించారు. దీంతో ఉపాధి పనులు కొన్నిచోట్ల ఆగిపోయాయని వివరించారు.

సారా నిర్మూలనకు చర్యలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో నాటు సారా నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.ప్రభుకుమార్ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నవోదయం 2.0లో భాగంగా జంగారెడ్డిగూడెం స్టేషన్ పరిధిలోని జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఏ, బీ, సీ కేటగిరిలో ఉన్న అన్ని గ్రామాల్లో నాటుసారాకి సంబంధించి సామాచారం సేకరించాలన్నారు. జంగారెడ్డిగూడెం స్టేషన్ పరిధిలోని మద్యం వ్యాపారులతో సమావేశం నిర్వహించి, మద్యం షాపులన్నీ సమయపాలన పాటించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఉల్లంఘనలు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సీఐ, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత



ఉద్యోగ నియామక పత్రం అందిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: పోలీసుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని, సిబ్బంది కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎక్సైజ్ శాఖలో పని చేస్తూ అనారోగ్యంతో మరణించిన కె.డేవిడ్‌రాజు కుమారుడు యశ్వంత్ పృధ్వీకి కారుణ్య నియామకంలో భాగంగా ఉద్యోగ నియామక పత్రాన్ని ఆయన అందజేశారు. యశ్వంత్‌కు ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ కల్పించినట్టు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, పోలీస్ ప్రధాన కార్యాలయ అధికారి వైఎస్‌వీ ప్రసాద్, పోలీస్ అధికారులు ఉన్నారు.

ఆర్థిక సాయం

అనారోగ్యంతో మరణించిన ఏఎస్సై డీవీవీఎస్ఎస్ మూర్తి కుటుంబానికి ఎస్పీ శివకిషోర్ ఆర్థిక సాయం అందించారు. ఏలూరు డీసీఆర్‌బీలో పనిచేసే సమయంలో అనారోగ్యంతో మూర్తి మృతిచెందారు. ఆయన భార్య వల్లీనాగ విజయలక్ష్మికి కార్పస్ ఫండ్‌గా రూ.1 లక్ష, పోలీస్ అసోసియేషన్ నుంచి రూ.1 లక్ష చెక్కు రూపంలో అందజేశారు. పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ నాగేశ్వరరావు, పోలీస్ అధికారులు ఉన్నారు.

పోస్టాఫీసుల్లో ప్రజలకు మెరుగైన సేవలు



కార్యక్రమంలో పాల్గొన్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీకర్ బాబు

ఏలూరు (టూటౌన్): డిజిటల్ ఇండియా చొరవలో భాగంగా భారత తపాలా శాఖ అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0 (ఏపీటీ 2.0)ని మంగళవారం స్థానిక పెద్ద పోస్టాఫీస్ వద్ద ప్రారంభించారు. ఇదే రోజు దేశవ్యాప్తంగా అన్ని తపాలా కార్యాలయాల్లో ఈ విధానాన్ని ప్రారంభించినట్టు ఏలూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్ శ్రీకర్‌బాబు తెలిపారు. నూతన సాఫ్ట్‌వేర్ వల్ల ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన, స్నేహపూర్వకమైన సేవలను అందించనున్నట్టు చెప్పారు. ఏలూరు డివిజన్‌లో ప్రధాన తపాలా కార్యాలయంలో ఈ నూతన విధానాన్ని ప్రారంభించి, ప్రజలకు అంకితం చేశారు. ప్రజలందరూ ఈ కొత్త వ్యవస్థ ద్వారా తపాలా శాఖ సేవలను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొత్త వ్యవస్థ తీసుకురావడంలో ప్రముఖ పాత్ర వహించిన ఏలూరు డివిజన్‌లోని సిస్టం అడ్మినిస్ట్రేటర్లను శ్రీకర్ బాబు సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.శ్రీనివాసరావు, ఏలూరు సౌత్‌జోన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్సు డి.శ్రీకాంత్, ఏలూరు నార్త్ జోన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్సు చంద్రశేఖర్, ఏలూరు హెడ్ పోస్టాఫీస్ పోస్టు మాస్టర్ డి.రంగారావు, హెడ్ పోస్టాఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రాపవుట్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి

భీమడోలు: జిల్లాను డ్రాపవుట్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ ఉద్యోగులు కృషి చేయాలని ఐసీడీఎస్ జిల్లా పీడీ పి.శారద అన్నారు. మండలంలోని గుండుగొలను, ఆగడాల లంక ఉన్నత పాఠశాలలను మంగళవారం ఐసీడీఎస్ పీవో ఎంఎస్ రాజశేఖర్‌తో కలిసి ఆమె ఆకస్మిక సందర్శన చేశారు. బడి ఈడు బాలికలు పాఠశాలలో చేరారో లేదో చూడాలన్నారు. వారిలో ఏడు నుంచి పదో తరగతి చదువుతూ మధ్యలో మానేసిన డ్రాపవుట్స్ ఉన్నారా తదితర విషయాలను హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా బడి ఈడు బాలికలు పాఠశాలల్లో ఉండాలన్నారు. బాలికలు డ్రాపవుట్‌గా మారడం వలన తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తున్నారన్నారు. ఈ విధానాన్ని మానుకోవాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పీవో ఎంఎస్ రాజశేఖర్, ఎంఈవో–1, 2 ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్, హెచ్‌ఎంలు జి.సునీత, బి.మోహనరావు, ఈవో మల్లిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నూర్జహాన్, కవిత తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తీరు అమానుషం

పెదపాడు: హనుమాన్ జంక్షన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించరాదని చెప్పడం అమానుషమని పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. అప్పనవీడులో సోమవారం వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ జంక్షన్ నాలుగు రోడ్ల వెంబడి ర్యాలీ నిర్వహించొద్దని పోలీసులు చెప్పడం సరికాదన్నారు. గతంలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తే ఎవరూ అభ్యంతరం తెలపలేదని ప్రస్తుతం పోలీసులు హనుమాన్ జంక్షన్ పరిధిలోకి రావొద్దని చెప్పారన్నారు. గుడివాడ రోడ్డులో కూడా హనుమాన్ జంక్షన్ పోలీస్ పరిధిలోనే ఉందని, ఏ ఘటన జరిగినా మేమే విధులు చేపడుతున్నామని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఏలూరు రోడ్డు మినహా ఏ రోడ్డుపైనా ర్యాలీ నిర్వహించొద్దని హెచ్చరికలు జారీ చేశారన్నారు. ఈ విధంగా వ్యవహరించడం ఎన్నడూ చూడలేదని పేర్కొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ సిగ్గుచేటు

- వైఎస్సార్ సీపీ పోరాటాలతో సీఎంకు వణుకు
- బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి



విలేకరులతో మాట్లాడుతున్న బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమ అరెస్టు సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లేని మద్యం స్కాంను సృష్టించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కీలక నేతలను అక్రమ అరెస్టులు చేస్తూ కేసుల్లో ఇరికిస్తూ రాక్షసానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్ట్ చేసి, జైలులో పెట్టినంత మాత్రాన తమ నేతలు, కార్యకర్తలు భయపడతారని అనుకోవటం భ్రమే అన్నారు. 13 నెలలుగా వైఎస్సార్‌సీపీ చేస్తోన్న ప్రజాపోరాటాలు చూసి సీఎం చంద్రబాబుకు వెన్నులో వణుకు పుడుతోందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలా అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని దోచుకోవటానికి ఎవరూ అడ్డురాకూడదనే ఉద్దేశంతో ఇలా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. లిక్కర్ వ్యవహారంలో తొలుత రూ.50 వేల కోట్లని, తర్వాత రూ.30 వేల కోట్లు అవినీతి అంటూ ప్రచారం చేసి, అనంతరం రూ.18 వేల కోట్లు, చివరి ఇప్పుడు రూ.2 వేల కోట్ల చిల్లర అంటున్న తమ చిల్లర బతుకులు ఇంతేనా బాబూ అంటూ ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిట్ దర్యాప్తులో ఎక్కడైనా డబ్బు సీజ్ చేశారా ? పోనీ పెట్టుబడులు ఏమైనా పెట్టారా ? ఆధారాలు ఏమీ లేకుండా కేవలం కల్పిత, కట్టుకథలతో కేసులు పెడితే ఎవరూ భయపడరని హెచ్చరించారు. ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులను బెదిరించి, భయపెట్టి, హింసించి వాంగ్మూలాలు తీసుకుని, కట్టుకథలు అల్లుతూ కుట్రపూరిత కేసులు పెట్టటం టీడీపీకే చెల్లిందన్నారు. న్యాయం ఖచ్చితంగా గెలుస్తుందని తెలిపారు. కృష్ణాజిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ చెందిన వారు దాడులకు తెగబడ్డారని, ఇలాంటి నీచ సంస్కృతిని విరమించుకోకపోతే ప్రతిచర్యలు ఉంటాయని హెచ్చరించారు. మాజీ మంత్రి రోజాపై టీడీపీ ఎమ్మెల్యే అత్యంత నీచంగా దూషించటం దారుణమన్నారు. పాలనపై ప్రజల్లో ఇప్పటికే పూర్తిస్థాయిలో వ్యతిరేకత వచ్చిందని, వారు టీడీపీ నేతల కాలర్ పట్టుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

ఇప్పటికీ బెయిల్‌పైనే చంద్రబాబు

వైఎస్సార్ సీపీ ఏలూరు నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ మాస్టర్, రాష్ట్ర కార్యదర్శి పరస చిన్నారావు మాట్లాడుతూ చంద్రబాబు ప్రస్తుతం ఏడు కేసుల్లో బెయిల్‌పై ఉన్నారని, తన కేసుల దర్యాప్తులను నిర్వీర్యం చేస్తూ వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు పెడుతూ కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఉంగుటూరు నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు తుమ్మగుంట రంగారావు, చింతలపూడి బీసీ సెల్ అధ్యక్షుడు గురుబ్రహ్మ, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తంగెళ్లమూడి సురేష్, జిల్లా కార్యదర్శి భోగాది ప్రభాకర్, కొలుసు గణపతి, వినుకొండ సూరిబాబు తదితరులు టీడీపీ నేతల అక్రమార్జనలు, అవినీతిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజలు కూటమి ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయారని, ప్రజల ఆశీస్సులు వైఎస్సార్ సీపీకే ఉన్నాయని తెలిపారు.

పంటల బీమాను వినియోగించుకోండి



కామవరపుకోటలో నారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కామవరపుకోట: పంటల బీమాను రైతులు సద్వినియోగపరుచుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ముత్యాలరావు అన్నారు. మంగళవారం మండలంలో కామవరపుకోట, కళ్లచెరువు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో గల వరి పంట పొలాలను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. మండలంలో 5700 ఎకరాలకు గాను ఇప్పటివరకు 310 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయినట్టు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల వరి పంట నష్టం జరిగినప్పుడు రైతులకు నష్టం జరగకుండా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఉపయోగపడుతుందన్నారు. ప్రతి రైతూ తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని తెలిపారు. ఒక ఎకరానికి రూ.840 ప్రీమియం కట్టాలని, ఈ అవకాశం ఆగస్టు 15 వరకు ఉందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

లింగపాలెం మండలంలో..

లింగపాలెం: లింగపాలెం, సింగగూడెం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. చింతలపూడి సహాయ వ్యవసాయ సంచాలకులు వై.సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ పంట బీమా పథకం పీఎంఎఫ్‌బీవై గురించి వివరించారు. రైతులు తమ భూమిని కౌలుకు ఇస్తే కౌలుదారులకు కౌలు కార్డులు ఇచ్చేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్‌కుమార, డీఆర్‌సీ ఉష, టెక్నికల్ ఏఓ ప్రసూన, మాజీ ఎంపీపీ మోరంపూడి మల్లికార్జునరవు, తగరం హేమలత, చిలుకూరి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ద్వారకాతిరుమల: పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించవద్దంటూ సీపీఎం నాయకులు మంగళవారం ద్వారకాతిరుమలలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక యూటీఎఫ్ భవనంలో తెల్లం రామకృష్ణ అధ్యక్షతన సీపీఎం జిల్లా స్థాయి రెండో రోజు విస్తృత సమావేశం నిర్వహించారు. తొలుత పార్టీ నాయకులు పసల సూర్యారావు సీపీఎం జెండాను ఆవిష్కరించారు. పార్టీ అగ్ర నేత, కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ మృతికి సంతాపం ప్రకటించి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లాలోని పలు ప్రజా సమస్యలపై చర్చించి తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ సీపీఎం పోరాటాల ఫలితంగానే పేదలకు ఇళ్లు, స్థలాలు, భూములు వచ్చాయని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ, ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నాయని విమర్శించారు. కోకో, కొబ్బరి, ఆయిల్ పామ్, మిర్చి, పొగాకు, వరి వంటి పంటల రైతాంగ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్నామన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం వంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, మెట్ట ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, వారికి పునరావాసం కల్పించాలని కోరారు. అనంతరం యూటీఎఫ్ భవనం వద్ద నుంచి శివాలయం ఆర్చిగేటు కూడలి వరకు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఆర్.లింగరాజు, జి.రాజు, ఎం.నాగమణి, కె.శ్రీనివాస్, ఇ.రామకృష్ణ, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	28
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	38
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	32
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	31
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	32
ఏలూరు – తిరుపతి	16.00	4830	34